ప్రశాంతంగా ముగిసిన ఉప ఎన్నికలు

- ఉత్కంఠంగా సాగిన కౌలురు 5వ వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి గెలుపు
- కౌలూరులో వైఎస్సార్‌సీపీకి పెరిగిన బలం
- ప్యాలకుర్తి 6వ వార్డులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడి విజయం



గోరంట్లలో ఓటు వేసేందుకు వేచివున్న ఓటర్లు

పాణ్యం: మండల పరిధిలోని కౌలురు గ్రామ పంచాయతీలోని ఐదో వార్డుకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి ముల్ల షంషాద్ విజయం సాధించారు. శనివారం అత్యంత ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరింది. మండలంలో టీడీపీ ఖాతాలో ఉన్న ఏకైక పంచాయతీ కౌలురు. కొన్నేళ్లుగా టీడీపీకి మద్దతుగా ఇక్కడి ప్రజలు ఉన్నారు. కానీ ఈ కంచుకోటలను వైఎస్సార్‌సీపీ బద్దలు కొట్టి .. ఓటర్లు వైఎస్సార్‌సీపీకే తీర్పు ఇచ్చారు. 5వ వార్డులో మొత్తం 97మంది ఓటర్లు ఉన్నారు. మధ్యాహ్నం కాక ముందే ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. ఈ పోలింగ్‌లో 92 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. వీరిలో 48మంది స్త్రీలు, 44 మంది పురుషులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి ముల్లా షంషాద్‌కు గౌన్ గుర్తు, ప్రత్యర్థి అభ్యర్థికి ప్రెజర్ కుక్కర్ కేటాయించారు. హోరాహోరిగా జరిగిన ఈ ఎన్నిక నాయకులకు సవాల్‌గా మారింది. లెక్కింపులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి ముల్లా షంషాద్‌కు 48 ఓట్లు, ప్రత్యర్థి అభ్యర్థికి 44 ఓట్లు పోలైయ్యాయి. దీంతో ముల్లా షంషాద్ 4 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు ఆర్‌ఓ కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం డిక్లరేషన్ పత్రాన్ని అందించారు. తనపై నమ్మకం ఉంచి గెలుపించిన ప్రజలకు సేవ చేసి రుణం తీర్చుకుంటామని వార్డుకు గెలుపొందిన సభ్యురాలు ముల్లా షంషాద్ అన్నారు. కాగా, మండలంలోని కొండజూటూరు 1వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి రాచమల్లు అపర్ణ ఇదివరకే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి మరో వార్డు

గతంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. అయితే గ్రామంలో టీడీపీకి ఎదురు లేదనుకునే సమయంలో మొదటి సారిగా ఇరు పార్టీలకు చెందిన అభ్యర్థులు చెరో 7 వార్డుల్లో గెలుపొందారు. ఐదవ వార్డులో గెలుపొందిన టీడీపీ సభ్యురాలు అకాల మరణంతో ఎన్నికల అనివార్యమైంది. ఈ వార్డులో కూడా గెలుపొందాలని అటు అధికార పక్షం, ప్రతిపక్షాలు అవిశ్రాంతగా పని చేశాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, వలంటరీల వ్యవస్థతో పంఛన్ ఇంటి వద్దకే తదితర కార్యక్రమాలతో సరాసరి సంక్షేమ ఫలాలు అందుతుండడం, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధిలతో ప్రజలు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థికి పట్టం కట్టారు. దీంతో ఐదవ వార్డు కూడా వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి పడింది. నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

భారీగా పోలీసులు బందోబస్త్

మండలంలో అత్యతం ఉత్కంఠ భరితంగా సాగిన ఈ ఎన్నికకును దృష్టిలో ఉంచుకున్న పోలీసులు భారీగా బందోబస్తు నిర్వహించారు. పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఆశోక్, వెంకటసుబ్బయ్య, మోహన్‌రెడ్డిల, ఏఎస్‌ఐలు, పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు. ఉదయం పోలింగ్ సరళిని నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు.

ప్యాలకుర్తిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలి విజయం

కోడుమూరు రూరల్ : మండలంలోని గోరంట్ల గ్రామంలో వార్డుమెంబర్-6, ప్యాలకుర్తి వార్డు మెంబర్-1వ స్థానానికి శనివారం జరిగిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ప్యాలకుర్తి వార్డు మెంబర్-1 స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ మద్దతుదారురాలు సంగాల సుగుణమ్మపై వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు సంజపోగు సుశీలమ్మ 63ఓట్ల మెజారీతో గెలుపొందారు. మొత్తం ఓట్లు 321 పోలవ్వగా సంగాల సుగుణమ్మకు 126 ఓట్లు, సంజపోగు సుశీలమ్మకు 186 ఓట్లు వచ్చాయి. 6 చెల్లని ఓట్లు పోలయ్యాయి. అలాగే గోరంట్ల వార్డు మెంబర్-6 స్థానానికి పుల్లగుమ్మి శ్యామల, లక్ష్మిదేవి, లాలెమ్మ పోటీ పడగా టీడీపీ మద్దతుదారురాలు లాలెమ్మ గెలుపొందారు. ప్యాలకుర్తి, గోరంట్ల ఎన్నికల అధికారులుగా హెచ్‌ఓ మదన్‌మోహన్, ఎంఈఓ శరభయ్యలు వ్యవహరించగా, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కోడుమూరు సీఐ శ్రీధర్ తన సిబ్బందితో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఉల్చాల 11వ వార్డు మెంబర్‌గా రాజోలి రాధాకృష్ణమ్మ గెలుపు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం ఉల్చాలలో 11వ వార్డు మెంబర్‌గా రాజోలి రాధాకృష్ణమ్మ 105 ఓట్ల మెజారిటీతో గెలుపొందిందని స్టేజ్- 2 ఆఫీసర్ (కర్నూలు రూరల్ ఎంఈఓ- 2) వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన వార్డు మెంబర్ ఎన్నికల్లో 67.9 శాతం ఓట్లు పోలయ్యాయి. 11వ వార్డులో 418 మంది ఓటర్లు ఉండగా 273 మంది తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు రాజోలి రాధాకృష్ణమ్మ 189 ఓట్లు, చెల్లనివి 7 ఓట్లు, నోటాకు 1 ఓటు పోల్ అవ్వగా మొత్తం 281 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ మద్దతుదారుడు నిడ్జూరు నాగరాజుకు కేవలం 84 ఓట్లు మాత్రమే పడటంతో ఘోరంగా పరాజయం పాలయాడు. 105 ఓట్ల మెజారిటీతో రాజోలి రాధాకృష్ణమ్మ గెలుపొందినట్లు స్టేజ్-2 అధికారి వినోద్ కుమార్, జోనల్ ఆఫీసర్ (కర్నూలు ఈఓఆర్‌డీ) నాగేశ్వర్‌రెడ్డి డిక్లరేషన్ ఫామ్ అందజేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయకేతనం

ఓర్వకల్లు: ఓర్వకల్లు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న మూడు వార్డు మెంబర్లకు శనివారం ఉప ఎన్నికలకు జరిగాయి. ఎన్నికల్లో బ్రహ్మణపల్లెలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి మద్దమ్మ, ఓర్వకల్లు వార్డు మెంబర్‌గా పోటీ చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సతీష్‌లు విజయకేతనం ఎగరవేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద డీఎస్పీ విజయశేఖర్ అధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ప్యాలకుర్తిలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలుపొందిన సంజపోగు సుశీలమ్మ డిక్లరేషన్ ఫాం అందిస్తున్న ఎన్నికల అధికారి



కౌలూరులో ఆర్‌ఓ కిషోర్‌కుమార్‌రెడ్డి నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్న ముల్లా షంషాద్



ఉల్చాల 11వ వార్డు మెంబర్‌గా గెలుపొందిన రాజోలి రాధాకృష్ణమ్మకు డిక్లరేషన్ ఫారంను అందజేస్తున్న ఎన్నికల అధికారులు

క్లుప్తంగా

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



వృద్ధుడికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మిథున్‌కుమార్ రెడ్డి

సి.బెళగల్: ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కె.సింగవరం గ్రామంలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు ఆయన, వైద్య సిబ్బంది వైద్య పరీక్షలను నిర్వహించి, అసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. శిబిరంలో 85 మందికి వైద్య సేవలను అందించినట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శిల్పా, ఏఎన్‌ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణ, డిజిటల్ ఆపరేటర్ రాజేష్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి మోహన్

గూడూరు: అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి జే.మోహన్ కోరారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో గూడూరు, సి.బెళగల్ మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో సమావేశం నిర్వహించారు. మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడీలకు పలు హామీలు ఇచ్చిందని, వాటిని వెంటనే అమలు చేయాలన్నారు. నాయకులు గుంటప్ప, అనంతమ్మ, మద్దమ్మ, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



లూయిస్ డాగురే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

కల్లూరు: కాల గర్భంలో కలిసే చరిత్రను సజీవంగా నిలిపేది ఫొటో అని కల్లూరు, కర్నూలు మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం అధ్యక్షులు ఎస్‌కె బాషా, నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రాఫీ దినోత్సవం వేడుకలు కల్లూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఘనంగా జరిగాయి. ముందుగా ఫొటోగ్రాఫీ పితామహుడు లూయిస్ డాగూరే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కల్లూరు, కర్నూలు ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఆస్పత్రిలో క్యాన్సర్ వార్డులో రోగులకు పండ్లు, కాన్పుల వార్డులో బ్రెడ్ల పంపిణీ, అనాథ పిల్లకు భోజనాలు అందించారు. కార్యక్రమంలో వాసుదేవయ్య, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి ఈ-కేవైసీ



తిరుపతి ఆసుపత్రిలో రేణుకతో ఈ-కేవైసీ చేయిస్తున్న వలంటీర్ వెంకటేశ్వరమ్మ

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామానికి చెందిన వలంటీర్ వెంకటేశ్వరమ్మ తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యూ.రేణుక వద్దకు వెళ్లి ఈ-కేవైసీ చేయించారు. గ్రామానికి చెందిన యూ. రేణుక మార్కాపురం ఎస్ఎస్ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతోంది. అనారోగ్యం కారణంలో తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రభుత్వం అందిస్తున్న జగన్న విద్యా దీవెన పథకానికి అర్హులు కావడంతో ఈకేవైసీ తప్పనిరిగా చేయించాలి. ఈ-కేవైసీ గడువు దగ్గర పడడుతండడంతో వలంటీర్ వెంకటేశ్వరమ్మ తిరుపతికి వెళ్లి ఈ-కేవైసీ చేయించింది.

విద్య, ఉద్యోగ అవకాశాలపై సదస్సు

కర్నూలు సిటీ: స్థానిక సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో విద్య, ఉద్యోగ అవకాశాలపై రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, అమెరికాలోని మాసాచుసెట్స్ విశ్వవిద్యాలయం ఆచార్య లు డా.మహేంద్ర బి.దేవల్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. విదేశాల్లో విద్య అవకాశాలు, ఉపకార వేతనాల గురించి వివరించారు. కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పంట నమోదు ఉంటేనే ప్రభుత్వ పథకాలు



కల్లపరిలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : మండలంలో ఖరీఫ్ కింద సాగు చేసిన పంటలను రైతులు ఈ -క్రాప్‌లో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని కల్లపరి గ్రామంలో పర్యటించి రైతులతో కలిసి పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఏయే పంటలు సాగు చేసి వుంటే ఆ పంటలను మాత్రమే ఆర్‌బీకే సిబ్బంది పంట నమోదు చేయాలన్నారు. రైతులు కూడా తాము సాగు చేసిన పంటలను ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి నమోదు చేయించుకోవాలని, పంట నమోదు ఉంటేనే ప్రభుత్వం ద్వారా వచ్చే ఉచిత పంటల బీమా, పండించిన పంటకు గిట్టుబాటు ధర వంటి పథకాలు వర్తిస్తాయని వివరించారు. ఉల్లి, మిరప వంటి పంటలు సాగు చేసిన రైతులు ఏదైనా సందర్భంలో పంట తొలగించాల్సి వస్తే ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకున్న తర్వాతనే తొలగించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

గడివేముల: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గడిగరేవుల జెడ్పీ హైస్కూల్‌లోని మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం పునఃప్రారంభించారు. కొన్ని రోజులుగా వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో విద్యార్థులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయన్నారు. గడిగరేవుల పాఠశాలకు నాడు-నేడు పనుల కింద దాదాపు రూ.కోటి నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, పీఎంసీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తి



ఆర్‌బీకే భవనానికి రంగులు వేస్తున్న దృశ్యం



పూర్తయిన గ్రామ సచివాలయం

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. గతేడాది సచివాలయం భవన నిర్మాణానికి రూ. 35 లక్షలు, ఆర్‌బీకే భవనానికి రూ. 21.80 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు భవన నిర్మాణాలను చేపట్టిన కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచి పనులను వేగవంతం చేశారు. దీంతో రెండు భవన నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగడంతో పూర్తి అయ్యాయి. భవనాలు పూర్తి కావడంతో రంగులు వేసే పనులు జరుపుతున్నారు. ఇప్పటికే గ్రామంలో సచివాలయం-1ను వినియోగంలోకి తీసుకుని వచ్చామని సచివాలయం-2 భవనంలో మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను కూడా పూర్తి చేసి ఆర్‌బీకేను కూడా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ మాధవీలత తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, ఈ మేరకు అలవాట్లు మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన చెప్పారు. స్థానిక ఎ.క్యాంపులో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కర్నూలు హెల్త్ క్లబ్‌లో శనివారం లిఫ్ట్ నిర్మాణానికి కలెక్టర్ భూమి పూజ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెల్త్‌క్లబ్‌లోని జిమ్, యోగా సెంటర్, ఇండోర్ గేమ్స్ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇందులోని ఏర్పాట్లు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఇక్కడ ప్రతి నెలా మొదటి ఆదివారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, డాక్టర్ పి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చంద్రబాబువి ఓటు బ్యాంకు రాజకీయాలు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం యాదవ్.

కర్నూలు(రాజ్‌విహార్): టీడీపీ అధినేత చంద్రబాబువి ఓటు బ్యాంకు రాజకీయాలని, రాష్ట్రంలోని యాదవులను అలాగే వాడుకున్న చరిత్ర ఆయనదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్యం యాదవ్ అన్నారు. శనివారం స్థానిక బిర్లా గేట్ వద్ద ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై రోజురోజుకు ప్రజాధారణ పెరిగిపోతుందన్నారు. ఇది గమనిస్తున్న చంద్రబాబుకు ముందస్తు ఓటమి పట్టుకుందని, దీంతో ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేస్తున్న సీఎం జగన్ యాదవుల ఆత్మగౌరవమైన 'సన్నిధి గొల్ల' వంశపారపర్యం హక్కును కల్పించి ఘనత దక్కించుకున్నారని పేర్కొన్నారు. ఇటు అన్ని ఆలయాల్లో ట్రస్టు బోర్డు సభ్యులుగా తమకు ప్రాధాన్యత కల్పించారన్నారు. ఇలాంటి ఎన్నో మంచి పనులు వైఎస్ జగన్ చేయడంతో యాదవులంతా వైఎస్ఆర్‌సీపీ పక్షానే ఉన్నారని చెప్పారు. పార్టీలో ఉన్న రమేష్ యాదవ్ స్వప్రయోజనాల కోసమే పార్టీకి రాజీనామా చేశారని, దీనిపై ఆలోచించుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు కృష్ణమూర్తి యాదవ్, మాజీ జెడ్పీటీసీ కాశీవిశ్వనాథ్‌రెడ్డి యాదవ్, రాజశేఖర్, రవి పాల్గొన్నారు.

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌కు రైతులు సహకరించండి



ఓర్వకల్లు గుట్టపాడులో భూముల రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

- అర్హులందరికీ పరిహారం అందిస్తాం
- కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

పాణ్యం: ఓర్వకల్లు మండల పరిధిలోని గుట్టపాడు గ్రామ పరిధిలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ విద్యుత్ సరఫరా లైన్ ఏర్పాటుకు అందరూ సహకరించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన కోరారు. శనివారం మండల పరిధిలోని కాల్వబుగ్గ నుంచి గుమ్మటం తండా గ్రామం వరకు ఏర్పాటు చేసిన రోడ్డును పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాల్వబుగ్గ గ్రామం నుంచి గుమ్మటంతండా వరకు వేయనున్న వంద మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన అర్హులందరికీ పరిహారం అందిస్తామన్నారు. అదేవిధంగా గుట్టపాడు పవర్‌గ్రిడ్‌లో భూముల కోల్పోయిన రైతులతో, కంపెనీతో కలిసి కమిటీ ఏర్పాటు చేసి పరిహారం ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ హరిప్రసాద్,తహసీల్దార్ శివ ప్రసాద్, గ్రీన్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూలో నాన్ టీచింగ్ సిబ్బంది బదిలీలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఆయా డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని బదిలీ చేసినట్లు వీసీ ఆనంద రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో మొత్తం 57 మంది బోధనేతర సిబ్బంది స్థానాలు మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): సీజనల్ వ్యాధులైన కళ్ల కలక, మలేరియా, డెంగీ నివారణకు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయుష్ దత్తత గ్రామం కర్నూలు మండలం పసుపుల గ్రామంలో ఆయుష్ గ్రామ్ వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి 15 రకాల ఏక మౌలికా ఔషద చూర్ణాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పునర్నవ గోక్షుర, త్రివృత్, యస్టి, కరక్కాయ, పిప్పలి, సరస్వతి, సర్పగంధ, ఉసిరిక, అరుజున, గుడూచి, అశ్వగంధ, శుంటీ, విడంగ, సతావరి ఔషద చూర్ణాలు యువకుల నుంచి వృద్ధుల వరకు వినియోగిస్తే సీజనల్ వ్యాధులు దరి చేరవని చెప్పారు. ఏపీ చూర్ణం ఎంత మోతాదులో ఎలా తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎలిజబెత్ రాణి, ఆశ వర్కర్లు తులశమ్మ, ధనలక్ష్మి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ప్రజలకు ఇబ్బందులు

గడివేముల: జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించిన భారీవాహనాలు గడివేముల గ్రామంలోకి వస్తుండటంతో తీవ్ర ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారీ వాహనాలకు రాత్రి 9 నుంచి ఉదయం 6 వరకు మాత్రమే అనుమతి ఉన్నా.. ట్రాన్స్‌పోర్టు యజమానులు పట్టించుకోవడం లేదన్నారు. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెంకటేశ్వరపురం మీదుగా కర్నూలుకు వెళ్లాల్సి ఉండగా మైలేజ్ కొసం గడివేముల మీదుగా భారీ వాహనాలను నడుపుతున్నారని ఆరోపించారు. దీంతో నిత్యం వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు, విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో పాతబస్టాండ్ ప్రాంతంలో లారీల కిందపడి ఇద్దరు చనిపోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. అదేవిధంగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించకుండా నడుపుతున్న ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారిణి మంజులాదేవి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. రెండేళ్ల క్రితం స్థానిక గ్రామ పంచాయతీ తీర్మానాలు లేకుండా సోలార్ పరిశ్రమ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు చూపించి యాజమాన్యం లైసెన్స్ ఫీజులు చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తప్పుడు లెక్కలు చూపించిన యాజమాన్యంపై చర్యలు తీసుకుని గ్రామాల భివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. గడివేములలోకి భారీ వాహనాల రాకపోకలను స్థానిక అధికారులు నియంత్రించాలన్నారు.

రైతు ఆత్మహత్య



మృతిచెందిన మండ్ల శ్రీకృష్ణదేవరాయలు

సి.బెళగల్: మండలంలోని ఇనగండ్ల గ్రామానికి చెందిన రైతు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘనట శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామంలోని బీసీ కాలనీలో నివాసముండే మండ్ల శ్రీకృష్ణదేవరాయలు అలియాస్ రాయల్ (52) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి, 10 గంటల అనంతరం పొలంలో పత్తి పంటకు నీళ్ల కట్టి వస్తానంటూ వెళ్లాడు. శనివారం ఉదయం రాయల్ తమ్ముడు భాస్కర్ పొలాని వెళ్లగా అక్కడ చింతచెట్టుకు చీరతో ఉరివేసుకున్న రాయల్‌ను చూశాడు. పొరుగు రైతుల సహాయంతో ఉరి తొలగించి, వైద్యం కోసం కోడుమూరు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా తన భర్త చావుకి తమకున్న అప్పులే కారణమని, తెలిసినవారి దగ్గర, బంధువుల దగ్గర దాదాపు రూ.5 లక్షల వరకు అప్పులు ఉన్నాయని భార్య రంగమ్మ తెలిపింది. అవి ఎలా తీర్చాలో అంటూ పలుమార్లు తనతో ఆవేదన చెందేవాడని వాపోయింది. రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పీరయ్య తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

సి.బెళగల్: పంటలు సాగు చేసుకుంటున్న రైతులు తమ పొలాలను ఈ - పంట నమోదు చేయించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని కొత్తకోట, ఈర్లదిన్నె, ముడుమాల గ్రామాలలో ఆర్బీకేలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల వ్యవసాయ అధికారులు, సిబ్బందితో కలిసి క్షేత్రాస్థాయిలో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. పంట నమోదు వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఎంపీఈఓ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

21న ఎస్‌ఆర్ పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

కర్నూలు(హాస్పిటల్) : కర్నూలు మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న 72 సీనియర్ రెసిడెంట్ పోస్టులను భర్తీ చేసేందుకు ఈనెల 21న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు అర్హులైన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. కర్నూలు మెడికల్ కళాశాలలో పీజీ చదివిన వారికి మొదటి ప్రాధాన్యతనిస్తామన్నారు. పూర్తి వివరాలకు www.kurnool medicalcollege.ac.in లో చూడాలన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన సోమవారం నిర్వహించనునట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, డైరెక్టర్లు, అధికా రులు వారి శాఖల నివేదికలతో హాజరుకావాలని కోరారు.



గార్గేయపురం సమీపంలో వజ్రాల వేటలో జనం



వజ్రాన్వేషణ

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని గార్గేయపురం డంప్‌యార్డుకు వెళ్లే దారిలో వజ్రాల వేట కొనసాగుతోంది. వారం రోజుల క్రితం గార్గేయపురానికి చెందిన ఒకరికి రూ.30 లక్షల విలువ చేసే వజ్రం లభ్యమైందనే ప్రచారం జరిగింది. దీంతో చుట్టు ముట్టు గ్రామాల ప్రజలు పిల్లాపాపలతో టిఫిన్‌లు, క్యారియర్‌లు తెచ్చుకుని అక్కడే తింటూ వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. శనివారం ఉదయం కూడా ఇద్దరు వ్యక్తులకు వజ్రం దొరికినట్లు అన్వేషనకు వచ్చిన వారు చెప్పారు.